


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

ఆదివారం | 25 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08




## పదిలో ర్యాంకులొస్తే ఢిల్లీకి విమాన పయనం

### ప్రతీక్ పాఠశాల విద్యార్థులకు ఆఫర్

### ఖర్చంతా కోమటిరెడ్డిదే

### కష్టపడి చదివితే ఉజ్వల భవిత

### కలెక్టర్ బి.చంద్రశేఖర్



**నల్గొండ, అక్షిత ప్రతినిధి :** నల్గొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థులు పరీక్షలో ప్రథమ ర్యాంకులు సాధిస్తే రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన సొంత ఖర్చులతో ఢిల్లీ పర్యటనకు తీసుకెళ్లను న్నారని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. విమాన ప్రయాణ ఖర్చులతో పాటు, ఇతర ఖర్చులు, షాపింగ్ ఖర్చులను కూడా ఆర్ అండ్ బి శాఖ మంత్రి భరిస్తారని, ఢిల్లీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తారని చెప్పారు. శని వారం జిల్లా కలెక్టర్ బొట్టుగూడలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల అభ్యసన సామ ర్థ్యాలు, విద్యా ప్రమాణాలు,మౌలిక సదుపాయాలను పరిశీలించారు. 7 తరగతి విద్యార్థులతో ..మిగతా 2లో

## యాసంగికి ఎసరు!



### సాగుకు సెలవే !! సేవ్ వాటర్... సేవ్ పవర్.. అంతా పొదుపు మంత్రం

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** యాసంగి పంటకు ఎసరొచ్చింది. ఈ పంట సాగుకు సెలవే.ముంచుకొస్తున్న ముప్పు దృష్ట్యా విరామం తప్పదు. అంతా పొదుపు మంత్రం.నీటి లభ్యత, భూసారం, అనుకూల వాతావరణ పరిస్థితులపై ఆధారపడి వ్యవసాయ రంగం ఉంటుంది. వర్షాలు సమృద్ధిగా కురిసి, జలవనరులు అందుబాటులో ఉన్నప్పుడు పంటల సాగు సాఫీగా సాగి, రైతుకు ఆదాయాన్ని అందిస్తుంది. అయితే లోటు వర్షపాతంతో జలాశయాలు, చెరువులు, భూగర్భజలాలు క్షీణించినప్పుడు పంటల దిగుబడులు తగ్గడమే కాకుండా సాగు పెట్టుబడులు నష్టాలుగా మారి రైతులు అప్పుల పాలయ్యే ప్రమాదముంది. ఈ ప్రభావం తాగునీరు, పశుపోషణ, విద్యుత్ ఉత్పత్తి, గ్రామీణ ఉపాధి, ఆహార భద్రతపైనా పడుతుంది. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షపాత లోటు పరిస్థితుల నేపథ్యంలో రాబోయే యాసంగి సాగును నీటి లభ్యతకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చేపట్టడం అత్యవసరం. ముఖ్యంగా తాగునీటికి ప్రాధాన్యమిస్తూ, నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఒక పంట కాలం సాగుకు విరామం ఇవ్వడాన్ని ప్రత్యామ్నాయంగా పరిశీలించాలి. వ్యవసాయంలో పంట సెలవు కొత్త పరిణామమేమీ కాదు. సుమారు పదిహేనేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు, పశ్చిమ ..మిగతా 2లో



## రహదార్లకు మహర్దశ

### ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

### రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

### మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత

**సూర్యాపేట, అక్షిత బ్యూరో :** ప్రజా అవసరాలకు అనుగుణంగానే అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నల్లగొండ, ఖమ్మం,వరంగల్ పట్టభద్రుల శాసన మండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్,మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదితలు తెలిపారు. పట్టణంలోని 33వ వార్డులో మున్సిపల్ ..మిగతా 2లో

## దివ్యాంగులను ఆదరిద్దాం

### శాంతి నిలయం ఆశ్రమాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత

### మెరుగైన వసతులు కల్పించాలి

### దివ్యాంగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని శాంతి నిలయం ఆశ్రమాన్ని రామన్నపేట మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. సబిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వహణాధి కారులతో మాట్లాడి, ఆశ్రమంలో నివసిస్తున్న వారి జీవన పరిస్థితులు, వారికి అందిస్తున్న సంరక్షణ, వసతులు, సౌకర్యాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో నివసిస్తున్న వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారి అవసరాలను గుర్తించి తగిన ..మిగతా 2లో

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY
ఆదివారం |25| అక్టోబర్ | 2026

## రహదార్లకు మహర్దశ

**మొదటి పేజీ తరువాయి...**

జనరల్ ఫండ్ ద్వారా రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు వారు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిల సహకారంతో పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పట్టణంలో మరింత అభివృద్ధి సాధించే దిశగా ముందుకు సాగుతున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాగుల వాసు,కౌన్సిలర్ గుణగంటి హేమ సతీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంజాద్ అలీ,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను ఆదరిద్దాం

**మొదటి పేజీ తరువాయి...**



సంరక్షణ అందించాల్సిన ఆవశ్యకతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి జి. సబిత మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. బలహీన వర్గాలకు న్యాయ సహాయం అందించడం, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించడం, న్యాయం పొందేందుకు అవసరమైన సహకారం అందించడంలో న్యాయ సేవా సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. సమాజంలోని బలహీన వర్గాలకు న్యాయ సేవలను చేరువ చేయడం, వారి హక్కులను పరిరక్షించడం, సామాజిక న్యాయం సాధించడం లక్ష్యంగా రామన్నపేట మండల న్యాయ సేవా కమిటీ తన కార్యక్రమాలను కొనసాగిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలి

**గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి రమేష్ గుప్తా**



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** మండలంలోని కడవేరుగు గ్రామ ప్రైమరీ స్కూల్ ఆవరణలో విద్యార్థులకు నీటి అవసరాల దృశ్య ఇటీవల దాతల సహకారంతో నూతన బోరు వేయడం జరిగింది. ఇట్టి బోరుకు జిపి నిధుల నుండి గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో శనివారం నూతన పంపు మోటర్ ను బోరుకు ఫిట్ చేయగా, గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి రమేష్ గుప్తా ఆధ్వర్యంలో పాలకవర్గంతో కలిసి నూతన బోరు మోటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామస్తుల సహకారంతో విద్యార్థులకు నీటి వసతిని ఏర్పాటు చేశామని, ఇలా అందరం కలిసి ఉంటే ఏపని నైనా సాధించవచ్చునని, గ్రామ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంగ సురేందర్, వార్డు సభ్యులు, కార్యదర్శి రాజు మరియు ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ బుచ్చయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# యాసంగికి ఎసరు!



**మొదటి పేజీ తరువాయి...**

గోదావరి, ఖమ్మం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వరి రైతులు గిట్టుబాటు ధరలు లభించకపోవడాన్ని నిరసిస్తూ పంట విరామానికి పిలుపునిచ్చారు. ఆర్థిక కారణాలతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల కూడా సాగు విస్తీర్ణం తగ్గిన సందర్భాలున్నాయి. 1987లో దేశవ్యాప్తంగా సంభవించిన తీవ్రమైన కరవు... పంటల ఉత్పత్తి, పశుగ్రాసం, గ్రామీణ ఉపాధి, తాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం చూపింది. అదేవిధంగా తెలంగాణలో 2015-16లో నెలకొన్న కరవుతో సాగునీటి వనరులు క్షీణించి, అనేక ప్రాంతాల్లో వరి సాగు గణనీయంగా తగ్గింది. ఈ అనుభవాలు కరవు తీవ్రమైన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కంటే ముందుగానే జలవనరుల లభ్యతను అంచనా వేసి సాగు ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.

గతంలో గిట్టుబాటు ధరల కోసం నిరసనగా ప్రకటించిన పంట సెలవుకు, ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న పంట విరామానికి మౌలికమైన తేడా ఉంది. నాటి పంట సెలవు ఆర్థిక సమస్యలపై నిరసన కాగా, నేటి పంట విరామం కరవు ముప్పును ఎదుర్కొనే ముందస్తు జాగ్రత్త చర్య. ఇందులో భాగంగా అందుబాటులో ఉన్న నీటిని మొదట తాగునీటికి, తరువాత పశు పోషణకు కేటాయించి, మిగిలిన లభ్యత ఆధారంగా వ్యవసాయ సాగును నిర్ణయించాలి. పరిమిత నీటి వనరులున్న ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, శనగ వంటి తక్కువ నీరు అవసరమయ్యే పంటలను స్థానిక నేల, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయవచ్చు. అయితే కనీస నేల తేమ కూడా లేని ప్రాంతాల్లో భారీ పెట్టుబడులతో సాగు చేపట్టి నష్టపోవడం కంటే ఒక పంట కాలం విరామం తీసుకోవడం ఆర్థికంగా సముచితం. సాగుకు ఇచ్చే తాత్కాలిక విరామాన్ని భూసార పునరుద్ధరణకు కూడా ఉపయోగించుకోవచ్చు. గత రెండు దశాబ్దాలుగా అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం, వానాకాలం, యాసంగి సీజన్లలో వరి వంటి ఒకే పంటను నిరంతరం సాగుచేయడం వల్ల అనేక ప్రాంతాల్లో నేల ఆరోగ్యంపై ఒత్తిడి పెరిగింది. పంట విరామ సమయంలో భూసార పరీక్షలు నిర్వహించడం, పంట అవశేషాలను నేలలో కలపడం, సేంద్రియ ఎరువులను వినియోగించడం వంటి చర్యలు చేపట్టాలి. పరిమితంగా నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పచ్చిరొట్ట పంటలను సాగు చేసి భూమిలో కలపవచ్చు. అదేవిధంగా ఒకే పంటను నిరంతరం సాగు చేసే ప్రాంతాల్లో విరామం ఇవ్వడం వల్ల కొన్ని చీడపీడలు, వ్యాధికారకాల జీవచక్రానికి అంతరాయం ఏర్పడి వాటి ఉధృతి తగ్గే అవకాశముంది. అయితే పంట విరామం ఒక్కటే భూసారాన్ని మెరుగుపరచదు. సమగ్ర నేల, పోషక యాజమాన్య చర్యలతో అనుసంధానించినప్పుడే దీర్ఘకాలిక ప్రయోజనాలు సాధ్యమవుతాయి.

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షపాత లోటు కారణంగా ప్రపంచంలోని పలు దేశాలతో పాటు, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లోనూ, ముఖ్యంగా తెలంగాణలోనూ నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని సుమారు 360 మండలాల్లో సాధారణం కంటే 30-40శాతం వరకు వర్షపాత లోటు ఉన్నట్లు వస్తున్న అంచనాలు పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నాయి. ఈ పరిస్థితులు కొనసాగితే డిసెంబరు నాటికి జలాశయాలు, చెరువులు, భూగర్భ జలాల్లో నీటి లభ్యత మరింత తగ్గుతుంది. ముఖ్యంగా వరి వంటి అధిక నీరు అవసరమయ్యే పంటలకు కీలక దశల్లో తగినంత నీరు అందకపోతే దిగుబడులు తగ్గుతాయి. దీంతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు, విద్యుత్, యంత్రాలపై పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక చిన్న, సన్నకారు రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. అందువల్ల మండలాలవారీగా వర్షపాతం, జలాశయాల నిల్వలు, భూగర్భ జలమట్టాలను సమీక్షించి యాసంగి సాగుపై ముందస్తు నిర్ణయం తీసుకోవాలి. నీటి కొరతకు తోడు విద్యుత్ సరఫరాలోనూ సవాళ్లు తలెత్తవచ్చు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బొగ్గు, సహజ వాయువు సరఫరాపై ప్రభావం చూపే అవకాశముండగా, వర్షాభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గవచ్చు.

# పదిలో ర్యాంకులొస్తే ఢిల్లీకి విమాన పయనం

**మొదటి పేజీ తరువాయి...**



నేరుగా మాట్లాడి వారి చదువు, విద్య పురోగతి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నారని? చదువులో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా ? అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు బాగా బోధిస్తున్నారని, తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం పదవ తరగతిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతి కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని సూచించారు. రిఫ్లెక్షన్, నాన్‌రిఫ్లెక్షన్‌కు సంబంధించిన అంశాలపై ప్రశ్నించగా, విద్యార్థులు బోర్డుపై సమాధానాలను వివరించిన తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు . 8,9,10 తరగతుల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్ ను ఆదేశించారు. తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ప్రతి విద్యార్థికి నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించి మెరుగైన మార్కులు సాధించేలా బోధన అందించాలని చెప్పారు. విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించి, వారి అభ్యసన స్థాయిని అంచనా వేశారు. మూత్రశాలలు పరిశీలించిన కలెక్టర్, నీటి కుళాయిల్లో లీకేజీలు లేకుండా చూడాలని, అవసరమైన చోట కొత్త కుళాయిలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటి వృథాను అరికట్టేందుకు పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న రోజుల్లో నీటి వినియోగంపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ,ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని, ఎక్కడా నీరు వృథా కాకుండా విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. పాఠశాలలో ప్రతిరోజూ ఉదయం ప్రార్థన సమయంలో విద్యార్థులతో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు.

విద్యార్థులు చదువుతో పాటు, సామాజిక బాధ్యత అలవర్చుకోవాలని, నీటి సంరక్షణపై తమ ఇంటితోపాటు, పరిసర ప్రాంతాల్లోనూ ప్రచారం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకురావడం ద్వారా మెరుగైన విద్యా ఫలితాలు సాధించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. అడిషనల్ డైరెక్టర్ రామాచారి, ఎంఈఓ అరుంధతి, ప్రధానో పాధ్యాయులు సురేష్ కుమార్, సుధారాణి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రామాలయానికి ఆర్థిక సాయం

**దాతల ఉదారత**



**మంథని, అక్షిత ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని రామాలయానికి కాటారం మండల కేంద్రానికి చెందిన గుడిమల్ల గణేష్ అరుణ దంపతులు 20వేల 116 రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీకి అప్పగించడం జరిగింది. మండల కేంద్రంలో సీతారామాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణ పనులు కొనసాగిస్తున్న క్రమంలో ఆలయ నిర్మాణానికి, కీర్తిశేషులైన గుడిమల్ల బుచ్చమ్మ లక్ష్మయ్య జ్ఞాపకార్థం, రాములవారి మందిర నిర్మాణంలో తమ వంతు సహకారం ఉండాలని గణేష్ అరుణ దంపతులు విరాళాన్ని అందించారు. ఆలయ నిర్మాణం లో తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విరాళం అందించడం ఎంతో గొప్ప విషయమని, ఆధ్యాత్మిక విలువలు, ధర్మంపై ఉన్న బాధ్యత, కనబరుస్తుందని, అన్నారు ఆలయ కమిటీ బాధ్యులు, అలాగే విరాళం అందించిన వారికి కమిటీ తరపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవరావు, చిటికేసి శ్రీనివాస్, కేదారి ప్రవీణ్ కుమార్, కేశవ్ కుమార్, తోపాటు భక్తులు ఉన్నారు.

# ఉత్తమ వైద్య సేవలతో ఉన్నత స్థానాలకు ఎదగాలి

**సామాజిక సేవలో భాగంగా కొందరికైనా ఉచిత వైద్యం చేయాలి**
**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ప్రభుత్వ వైద్య కళాశాలలో ఘనంగా వైట్ కోట్ సెర్మనీ**

**హాజరైన జిల్లా కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితె**



**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** వైద్య కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు డాక్టర్లుగా ఉత్తమ వైద్య సేవలు అందించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైట్ కోట్ సెర్మనీ శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె



హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య విద్యార్థులకు వైట్ కోట్ లు అందజేసి అభినందించారు. అనంతరం నిర్వాహకులు జిల్లా కలెక్టర్, ఎస్పీని శాలువాతో సన్మానించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సమాజంలో వైద్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని తెలిపారు. వైద్య విద్య అభ్యసించేందుకు చాలా కష్ట పడాల్సి ఉంటుందని, నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఈ అవకాశం వస్తుందని వివరించారు. ప్రతి విద్యార్థి విజయం వెనుక వారి తల్లిదండ్రుల శ్రమ, ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు. వైద్యుల సేవలు చాలా కీలకమని స్పష్టం చేశారు. గర్భిణులు, పిల్లలు, వివిధ రోగాలతో బాధ పడే వారికి వైద్యులు ఎంతో ఓపికతో సేవలు అందిస్తారని కొనియాడారు. వైద్యులు తాము ఎంచుకున్న విభాగంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో భాగంగా వైద్యులు కొందరికైనా ఉచిత వైద్య సేవలు అందించాలని సూచించారు. దీంతో ఆత్మ సంతృప్తి ఉంటుందని తెలిపారు. వైద్యం, సేవల్లో మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాక్షించారు. వైద్యులు తమ ఆరోగ్యం, ఆహారం శ్రద్ధ పెట్టాలని సూచించారు. సిరిసిల్ల వైద్య కళాశాల, బాలికల, బాలుర హాస్టల్ నిర్మాణ పనులను తాను పలుమార్లు సందర్శించానని గుర్తు చేశారు. ప్రస్తుతం బాలికల హాస్టల్ వినియోగంలోకి వచ్చిందని తెలిపారు. మెడికల్ కాలేజీ, బాలుర హాస్టల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి.. త్వరలోనే వినియోగంలోకితీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ నిర్విష, తహసీల్దార్ మహేష్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సాయిపూర్‌లో ఆంజనేయ స్వామివారి ప్రత్యేక అభిషేకం

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి..**



**తాండూరు అక్షిత ప్రతినిధి:** తాండూరు పట్టణం సాయి పూర్‌లోని శ్రీ ప్రసన్న అభయ ఆంజనేయ స్వామి దేవా లయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి, స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభిషేక కార్యక్రమంలో భాగంగా ఆలయంలో అర్చనలు, పూజా కార్యక్రమాలను సంప్ర దాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా నీరజా బాల్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ ఆయు రారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రార్థించారు. ఆంజనేయ స్వామివారి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లి విరియాలని, ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ ప్రత్యేక అభిషేక కార్యక్రమం భక్తుల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపింది.

# లోకేశ్వరంలో ఘనంగా రెబల్‌స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలు

**కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న అభిమానులు**




**లోకేశ్వరం, అక్టోబర్ 24 అక్షిత న్యూస్ :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రంలో సినీనటుడు రెబల్‌స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డార్లింగ్ షఫీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి గ్రామ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ముఖ్య అతిథులను ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డార్లింగ్ షఫీ శాలువాలతో సత్కరించారు. అభిమానులు ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ ప్రభాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తమ అభిమాన నటుడి నినాదాలు చేస్తూ సందడి చేశారు.

ప్రభాస్ మరిన్ని విజయాలు సాధించి, భవిష్యత్తులో తన చిత్రాలతో ప్రేక్షకులను అలరించాలని అభిమానులు ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో అభిమానులు సురేష్, పెద్దోళ్ల రాజు,జెర్సీ రాజు, గోనేటి జగదీష్,తదితరులు పాల్గొన్నారు...

# గడల శ్రీనివాసరావు గెలుపే ధ్యేయంగా.. అడవిదేవులపల్లిలో జనసేన ఆధ్వర్యంలో ఓటరు నమోదు

**అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి:** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేసేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు విజయమే లక్ష్యంగా మిర్యాలగూడ నియోజకవర్గ జనసేన నాయకులు కోట్రా గోవర్ధన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకులు మేకల సతీష్‌రెడ్డి సూచనల మేరకు,ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్లు మేడ రామకృష్ణ,పి.ఆర్.రాఘవేందర్ మార్గదర్శకత్వంలో పట్టభద్రుల ఓటరు నమోదు




ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కోట్రా గోవర్ధన్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవడం తప్పనిసరని తెలిపారు.ఓటరు నమోదు గడువు నవంబర్ 6,2026తో ముగియనున్నందున అర్హులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కనకయ్య, భార్గవ్, వెంకటేశ్వర్లు,ఆంజనేయులు,వెంకట్, పఠాన్,షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

---

# సంగెం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు నేడు హైదరాబాద్‌లో అవార్డుల అందజేత

**అదిలాబాద్ / ఇచ్చోడ అక్షిత న్యూస్ :** కరోనా కష్ట కాలం నుండి క్రమం తప్పకుండ ప్రతి ఆదివారం ఉచిత అన్నదానం చేస్తూ ఇతర సామాజిక సేవలో ముందుంటున్న అదిలాబాద్ జిల్లా సంగెం ట్రస్ట్ సభ్యులకు అవార్డులు వరించాయి. హైదరాబాద్ లోని తెలంగాణా సర స్వతి పరిషత్ లో నేడు ఆదివారం మేఘా సిటీ నవకళా వేదిక డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం ఎక్సెలెన్సీ అవార్డు 2026 తో సన్మానించను




న్నారని సంగెం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ సుధీర్ కుమార్ సంగెం (న్యాయ వాది ) ఒక ప్రకట నలో తెలిపారు. సంగెం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చిలుకూరి మహేం దర్ రెడ్డి, సలీముద్దీన్, శుభాష్, అంబయ్య, రాజయ్య, అజయ్, రాఘవ, అవార్డులకు ఎంపికయ్యా రని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మాజీ స్పీకర్ మధుసూదన చారి, మాజీ కేంద్ర మంత్రి, సముద్రాల వేణు గోపాల చారి, మాజీ బీసీ కమీషన్ చైర్మన్ వకుళా భరణం కృష్ణ మోహన్, నవకళా వేదిక అధ్య క్షులు మల్లి కార్జున్ రావు హాజర వుతున్నారని ఆయన తెలిపారు.

## మంద కృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



చౌటుప్పల్/ అక్షిత న్యూస్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగని తన నివాసంలో ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం చౌటుప్పల్ మాజీ మండల అధ్యక్షులు ఆరుట్ల లింగస్వామి, ఎమ్మార్పీఎస్ మున్సిపాలిటీ నాయకులు బోదుల స్వామి లు శనివారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. భవిష్యత్తులో పెద వర్గల ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం, అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసునే విధంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమ కార్యచరణ ఉంటుందని తెలిపారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాలలో మాదిగ విద్యార్థి ఫెడరేషన్ ఎంఎస్ఎఫ్ కమిటీలు వేగవంతం చేయాలని మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చినట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు.

## చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులుగా జె. రంజిత్ బాధ్యతల స్వీకరణ



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: మహబూబ్‌నగర్ జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులుగా జె. రంజిత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు చేనేత, జౌళి శాఖ కమిషనర్ కార్యాలయంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన జె. రంజిత్‌కు మహబూబ్‌నగర్ జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులుగా పదోన్నతి కల్పిస్తూ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు ఆయన శుక్రవారం జిల్లా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

జిల్లాలో చేనేత కార్మికులు, జౌళి రంగానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడం, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవడం, చేనేత రంగ అభివృద్ధికి కృషి చేయడం తన ప్రాధాన్యతలుగా ఉంటాయని జె. రంజిత్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన శనివారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖకు సంబంధించిన పరిపాలనా అంశాలు, శాఖా కార్యక్రమాల అమలు తదితర విషయాలపై కలెక్టర్‌కు వివరించారు.

## ఆరెళ్ళ బాలనర్సవ్వకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు



చేర్యాల అక్షిత ప్రతినిధి: మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలనర్సవ్వ కు, జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లారాజేశ్వర్ రెడ్డి సహకారంతో 32500 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు సాంక్షన్ అయినందున, శనివారం గ్రామ సర్పంచ్, బిఆర్ఎస్ గ్రామ నాయకులతో కలిసి లబ్ధిదారులైన బాల నర్సవ్వకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బాల నర్సవ్వ ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి కి మరియు గ్రామ బిఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శైలజా శివశంకర్, ఉప సర్పంచ్ బంగారి గల్లా కిరణ్ కుమార్,బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు అరిగే కనకయ్య, మరియు వార్డు సభ్యులు ఏలుసని యాదగిరి, రోమాల సురేష్, ఆలేటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ 'ఇందిరమ్మ' భరోసా..

### దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

### మామడ మండలం దిమ్మదుర్తిలో కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆకస్మిక పర్యటన



నిర్మల్, అక్షిత ప్రత్యేక ప్రతినిధి (అక్టోబర్ 24): నిర్మల్ జిల్లాలో ఇళ్లు లేని అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్లు' సంక్షేమ ఫలాలు దక్కేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ వంద శాతం అందేలా సమగ్ర పరిశీలన చేపట్టాలని ఆయన ఆదేశించారు.



శనివారం ఆయన మామడ మండలం దిమ్మదుర్తి గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో తిరిగి ఇళ్ల పరిస్థితిని పరిశీలించారు.

**పొరపాట్లకు తావులేకుండా పారదర్శకత ముఖ్యం**

ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తులను అధికారులు అత్యంత క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి, నిజమైన అర్హత కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తిగా పారదర్శకతతో వ్యవహరించాలని అధికారులకు హితవు పలికారు. ఒకవేళ ఇళ్ల మంజూరులో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే, వాటిని తక్షణమే గుర్తించి పరిష్కరించాలని అధికారులను అప్రమత్తం చేశారు.

ఈ పర్యటనలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు...

## కట్ట హనుమాన్ ఆలయంలో మహా అన్నదానం

### సర్పంచ్ కరిపె శోభారాణి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ...

### అన్నదాన నిర్వాహకులను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు





లోకేశ్వరం, అక్టోబర్ 24 అక్షిత న్యూస్ : నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రంలోని కట్ట హనుమాన్ ఆలయంలో ప్రతి శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా ఈ శనివారం గాడ్‌చందా గ్రామ సర్పంచ్ కరిపె శోభారాణి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

అంతకుముందు ఆలయ పూజారి అనుమోల్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నప్రసాదం అందించారు.

ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి అభినందించారు. ప్రతి శనివారం అన్నదానం నిర్వహిస్తూ భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఆలయ పూజారి అనుమోల్ తదితరులు పాల్గొన్నారు...

## ఎల్ నినో ప్రభావం ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై కవులు గాయకులకు అవగాహన సదస్సు

### సదస్సులోపాల్గొన్న కవి గాయకులుపిన్నింటి రత్నం



కొమురవెల్లి అక్షిత న్యూస్: తెలంగాణ ప్రభుత్వం బాషా సాంస్కృతిక శాఖసమాచార పౌరసంబంధాల శాఖఆధ్వర్యంలోసమాచార పౌర సంబం ధాల శాఖ అధికారులకు తెలంగాణ సాంస్కృతిక సారథిరచయితలకు గాయకులకు కళాకారులకు నిన్న రవీంద్రభారతిలోఅవగాహన సదస్సు నిర్వహించగా కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం సదస్సులో పాల్గొని మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజా చైతన్యం కొరకు 5 పాటలు రాసి ప్రభుత్వానికి పంపడం జరిగిందని సారధి కవులురచయితలు ఇప్పటివరకు 100 పాటలు రాశారని అవి త్వరలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌మనుగునరసింహా రెడ్డి ఐఏఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ డాక్టర్ జివి వెన్నెలక్క ఆధ్వర్యంలో పుస్తకముద్రణఅవుతుందని తెలుపుతూ ఎన్నిలో ప్రభావం పై ప్రజలు అప్రమత్తం ఉండాలని ధనం కాదురా మనిషికి మూలం అని జలమే కదా మనిషికి జీవం అని ప్రతి నీటి బొట్టు ఒడిసి పట్టుకోవాలని నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ,విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని ఎల్ నినో కరువు తీవ్రతను ప్రతిఒక్కరుఎదురుకోవాలని పిన్నింటి తన రచనల ద్వారా అవగాహన కల్పిస్తున్నానని తెలిపారు.

# జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరికీ 125 రోజులు ఉపాధి

**విబిజి రామ్ జీ పథకంతో గ్రామీణ పేదలకు ఆర్థిక భరోసా...**

**ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయానికి ముప్పు పొంచి ఉంది కలెక్టర్ భవేశ్ మిశ్రా...**

**కడెం మండలం కొండుకూరులో జోన్-1 స్థాయి అవగాహన సదస్సు...**




నిర్మల్,అక్షిత ప్రతినిధి అక్టోబర్ 24 : వ్యవసాయ రంగంపై ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్న తరుణంలో గ్రామీణ పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 'విబిజి రామ్ జీ' పథకం ద్వారా 125 రోజుల పాటు ఉపాధి కల్పించాలని అధికారులను ఆదేశించారు. కడెం మండలం కొండుకూరు గ్రామంలోని ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన జోన్-1 స్థాయి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

**ఎల్‌నినో ముప్పుపై అప్రమత్తత...**

ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయే అవకాశముందని, దీనివల్ల పంటల దిగుబడి తగ్గి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు సన్నగిల్లే ప్రమాదముందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు విబిజి రామ్ జీ పథకం గ్రామీణ కూలీలకు కొండంత అండగా నిలుస్తుందన్నారు. జాబ్‌కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 125 రోజుల పనిదినాలను పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కూలీలకు ఎలాంటి జాప్యం లేకుండా వేతనాలు సకాలంలో చెల్లించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.




**నీటి సంరక్షణ పనులకే పెద్దపీట**

గ్రామాల్లో కేవలం ఉపాధి కల్పనే కాకుండా, భవిష్యత్తుకు ఉపయోగపడేలా జలవనరుల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఈ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తులు సమకూరుతాయని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లో భాగస్వాములు కావాలని, అవసరమైతే అధికారులే నేరుగా ప్రజల వద్దకు వెళ్లి పథకం విశేషాలను వివరించాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు సందీప్, తుకారాంతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

**దేవస్థానం చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్**



చౌటుప్పల్ /అక్షిత న్యూస్: చౌటుప్పల్ మండల కేంద్రం, దండు మల్కాపురం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఈవో చిట్టెడి వెంకట్ రెడ్డి, పరిశీలకులు ఎన్.నిఖిల్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని దేవస్థానం చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఈవో చిట్టెడి వెంకట్ రెడ్డి, పరిశీలకులు ఎన్.నిఖిల్ లు సందర్భంగా దేవస్థానం ఆధీనంలో ఉన్నటువంటి షట్టర్లను పరిశీలించారు.త్వరలోనే దేవస్థానం షట్టర్లను కొత్త టెండర్లు వేయాలని వారు నిర్ణయించిన్నట్లు దేవస్థానం చైర్మన్ దేపా శ్యామ్ సుందర్ ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు సిలువేరు శంకర్ ,దాడి లింగస్వామి, ఎల్లంకి లింగాచారి ,ఎక్స్ అఫీషియో మెంబర్ పెద్ది శ్రీధర్ శర్మ ,వార్డు మెంబర్ ఈదుదల ఇంద్రసేన యాదవ్ ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి పక్కీర్ ప్రభాకర్ రెడ్డి లు పాల్గొన్నారు.

## పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ని మర్యాదపూర్వకంగా కలిసిన డా. ఆరిఫుద్దీన్



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ని మర్యాదపూర్వకంగా కలిసి,హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ల సమస్యలు, వారి అభ్యున్నతికి సంబంధించిన అంశాలను వివరించి, వారి ఆశీస్సులు మరియు మద్దతును కోరడం జరిగింది.మీ శ్రేయోభిలాషి,డా. ఎం.డి. ఆరిఫుద్దీన్ కల్వకుర్తి (ఓ యూ )స్వతంత్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్

హెల్ప్‌లైన్: 9491487423

**మీడియా మిత్రులకు ప్రత్యేక విజ్ఞప్తి**

మీడియా మిత్రులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.దయచేసి ఈ కార్యక్రమానికి సంబంధించిన వార్తను మీ విలువైన మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. గతంలో మీరు అందించిన ప్రోత్సాహం, సహకారం నాకు ఎంతో విలువైనవి. మీ ఆదరణకు నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడిగా ఉంటాను.మీ మద్దతు, మీ ప్రోత్సాహం నా సామాజిక సేవా ప్రయాణానికి ఎంతో బలాన్నిస్తాయి.

## బడంగ్‌పేట్ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి

రంగా రెడ్డి అక్షితబ్యూరో : బడంగ్‌పేట్‌లోని రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పాఠకులకు అందిస్తున్న సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, గ్రంథాలయ నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

గ్రంథాలయానికి వచ్చిన పాఠకులతో ఆమె మాట్లాడి, ముఖ్యంగా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల సన్నద్ధత గురించి ఆరా తీశారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు సరైన ప్రణాళికతో చదవడం, సమయపాలన





పాటించడం, నిర్దిష్ట లక్ష్యంతో నిరంతరం సాధన చేయడం, అందుబాటులో ఉన్న పుస్తకాలు మరియు అధ్యయన సామాగ్రిని సమర్థవంతంగా వినియోగించుకోవడం వంటి అంశాలపై పాఠకులకు సూచనలు చేశారు.

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు క్రమశిక్షణతో చదువుతూ, ప్రస్తుత అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని, పునశ్చరణకు తగిన సమయం కేటాయించాలని సూచించారు. గ్రంథాలయాలు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విజ్ఞానాన్ని అందించడంతో పాటు, వారి భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడే ముఖ్యమైన వేదికలని పేర్కొన్నారు.

అనంతరం గ్రంథాలయంలో పాఠకులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పుస్తకాల లభ్యత, అధ్యయన వాతావరణం తదితర అంశాలను పరిశీలించారు. పాఠకులకు మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**మానవత్వాన్ని చాటడం సామాజిక సేవా సంస్థ బాధ్యత**



వరంగల్, అక్షిత బ్యూరో: పారిశుద్ధ్య కార్మికురాలు గువ్వల కొమురమ్మ కుమారుడు గువ్వల కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ వార్తను తెలుసుకున్న సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలుకలపల్లి శ్రీధర్ తన స్నేహితుడు కవి సహకారంతో శనివారం కొమరమ్మ కుటుంబాన్ని పరామర్శించి వారికి 25 కిలోల బియ్యం అందించారు.

శోకసముద్రంలో మునిగి ఉన్న కుటుంబాన్ని పరామర్శించి తోచిన విధంగా వారిని ఆదుకోవడం మానవత్వం అని పారిశుద్ధ్య కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోవడం తమ బాధ్యతలని సంస్థ నిర్వాహకుడు శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా సామాజిక సేవా సంస్థ కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY

## చిలుకూరు పరిధిలో విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలి



**చిలుకూరు, అక్టోబర్ 24,( అక్షిత న్యూస్):** 33/11 కేవీ చిలుకూరు సబ్‌స్టేషన్ పరిధిలో సోలార్ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల కారణంగా రేపు (అక్టోబర్ 25) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చిలుకూరు విద్యుత్ శాఖ ఏఈ (ఆపరేషన్) ఒక ప్రకటనలో తెలిపారు.ఈ అంతరాయం కారణంగా చిలుకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలతో పాటు వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు, రైతులు, పారిశ్రామిక సంస్థల విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. కావున వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సోలార్ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను సురక్షితంగా, సకాలంలో పూర్తి చేసేందుకు విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. పనులు పూర్తయ్యే సమయాన్ని బట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో మార్పులు ఉండవచ్చని ఏఈ పేర్కొన్నారు

## 12వ వార్డులో నూతన రేషన్ కార్డులు అందజేత



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్ :** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 12వ వార్డులో 42 వ రేషన్ షాప్ కు సంబంధించి కొత్త రేషన్ కార్డులను సుమారు 160 పైగా లబ్ధిదారులకు వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. అనంతరం 12వ వార్డులో ఏలినీనో ప్రభావంవల్ల జరిగే నష్టాలు, నీరు,విద్యుత్ వంటి ఇతర సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వార్డు ప్రజలకు కౌన్సిలర్ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ ల సహకారంతో మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.వార్డు అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ భాస్కర్ పుట్టినరోజు వేడుకలు



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాజిపేట్ చౌరస్తాలో శనివారం రోజున మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ భాస్కర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగినాయి.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా దాస్యం విజయ్ భాస్కర్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా అందరి సమక్షంలో కేక్ కట్ చేసే జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి దాస్యం విజయ్ భాస్కర్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు సంకు నర్సింగ్ రావు,నార్లగిరి రమేష్,సుంచు కృష్ణ,దువ్వ కనకరాజు,శ్రీనివాస్ బెదరకోటరంజిత్,మాచర్ల ప్రభాకర్, పి . శివ,రాజు,మహిమూద్,నయీం జుబేర్,తండమల్ల వేణు,చందర్ బస్వా యాదగిరి,సుబ్బు,రాజు, కిట్టు గబ్బేట సిద్దు పాల్గొన్నారు.

# ప్రజలకు సత్వరమే పోలీస్ సేవలు




### డయల్ 112 ఫిర్యాదులపై తక్షణమే స్పందన

### నేరస్థులపై నిరంతర నిఘా ఉంచాలి

### జిల్లా ఎస్పి నరసింహ

**సూర్యాపేట , అక్షిత బ్యూరో :** ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ,ప్రతి ఫిర్యాదుపై నిర్ణీత సమయంలో స్పందిశీచి బాధితులకు సహాయం అందించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఒకటవ,రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లలోని వివిధ విభాగాలను,కేసులకు సంబంధించిన స్వాధీన సామగ్రిని,రిసెప్షన్ సెంటర్ల పనితీరును పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు.పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్,షీ టీమ్ భవన నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో స్వాధీనశీ చేసుకున్న సామగ్రిని నిబంధనల ప్రకారం భద్రపరచి,వాటికి సంబంధించి న రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్,షీ టీమ్ భవన నిర్మాణ పనులను ఎస్పీ పరిశీలించారు. ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు,కుటుంబ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి, మహిళలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.స్టేషన్లలో నిర్వహిస్తున్న రిసెప్షన్ సెంటర్లను పరిశీలించి,ఫిర్యాదు దారుల నుంచి పిటిషన్లు స్వీకరిస్తున్న విధానం,వాటిని నమోదు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు దారుడితో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ్రామీసేవ ద్వారా అందిన ఫిర్యాదులు, దరఖాస్తులపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు.డయల్ 112 ద్వారా పగలు లేదా రాత్రి వచ్చే అత్యవసర ఫిర్యాదులపై బ్లూకోల్ట్స్,పెట్రోలింగ్ సిబ్బంది, ఎస్ఎస్ఓ నియమించిన సిబ్బంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకోవాలన్నారు. స్థలానికి చేరుకున్న వెంటనే పరిస్థితిని అంచనా వేసి, పరిస్థితిని అదుపులోకి తీసుకు రావాలని,తదుపరి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు.పరిస్థితిని బట్టి అదనపు పోలీస్ బలగాలు అవసరమైతే వెంటనే రప్పించుకొని శాంతి భద్రతలను కాపాడాలని ఆదేశించారు. బ్లూకోల్ట్స్,పెట్రోలింగ్ సిబ్బంది తమ పరిధిలోని రౌడీషీటర్లు, గంజాయి నేరాలకు పాల్పడే వ్యక్తులు,సైబర్ నేరగాళ్లు, దొంగతనాలకు పాల్పడే వ్యక్తులు,ఇతర అసాంఘిక శక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని ఆయన సూచించారు.ఈ సమయంలో ఎస్పి వెంట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య,ఎస్ఐ గోపీకృష్ణ, ఎస్ఐ సురేష్,సిబ్బంది ఉన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణకు.. పోలీసు, అటవీ శాఖల సమిష్టి కృషి అవసరం

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

### పోలీసు, అటవీ శాఖ అధికారులకు ఒకరోజు శిక్షణ





**అదిలాబాద్/ ఇచ్చోడ అక్షిత న్యూస్:** వన్యప్రాణుల సంరక్షణకు పోలీసు, అటవీ శాఖల సమిష్టి కృషి అవసరమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు, పర్యావరణ పరి రక్షణ కేవలం ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదని, పోలీసు, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే అక్రమ కార్యకలాపాలను పూర్తి స్థాయిలో అరికట్టడం సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. వన్యప్రాణుల వేటగాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం, వన్యప్రాణులను సంహరించిన కేసుల్లో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించడం, నిందితులకు న్యాయస్థానంలో శిక్షలు పడేలా అనుస రించాల్సిన విధానాలపై పోలీసు, అటవీ శాఖ అధికా రులకు శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. వీసీ ద్వారా కూడా పలువురు అధికారు లు, సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. అడవుల్లో పులులు, ఇతర వన్య ప్రాణులను వేటాడటం, అక్రమంగా కలప తరలించ డం, పొలాల్లో అక్రమంగా విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసి వన్యప్రాణుల ప్రాణాలకు ముప్పు కలిగించడం, మారు మూల ప్రాంతాల్లో గంజా యి సాగు చేయడం వంటి అక్రమ కార్యకలాపాలను సమర్థవంతంగా అడ్డుకోవా లని ఎస్పీ సూచించారు. ఇలాంటి కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం అటవీ శాఖ అధికారులకు తెలిసిన వెంటనే జిల్లా పోలీసు అధికారులకు తెలియ జేసి, సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. వన్య ప్రాణుల సంరక్షణకు సంబంధించి నమోదయ్యే కేసు ల్లో నిందితులకు శిక్షలు పడటం అత్యంత కీలకమని, అందుకు అనుగుణంగా దర్యాప్తు అధికారులు సాక్ష్యా ధారాలను పకడ్బందీగా సేకరించాలన్నారు. కేసుల దర్యాప్తు నుంచి న్యాయ స్థానంలో విచారణ పూర్త య్యే వరకు కోర్టు డ్యూటీ అధికారులు, దర్యాప్తు అధి కారులు సమన్వయంతో వ్యవహరించాలని, చట్ట పరమైన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాల ని పేర్కొన్నారు. రెండు శాఖల అధికారులు పరస్పర సమాచార మార్పిడి, సమన్వ యంతో పనిచేస్తూ అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాల న్నారు. యూనిఫామ్ గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగిం చేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవా లని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఇన్‌చార్జి డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్, శిక్షణలో ఉన్న ఐఎఫ్ఎస్ అధికారులు, ఎఫ్ఆర్ఓలు, డిప్యూటీ ఎఫ్ఆర్ఓలు, రేంజ్ అధికారులు, కోర్టు డ్యూటీ అధి కారులు, దర్యాప్తు అధికారులు, రైటర్లు, ఇతర పోలీ సు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నైపుణ్య విద్యకు పెద్దపీట వేయాలి



### అల్ఫోర్స్ అధినేత

### వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్

### త్వరలో నర్సరీ నుంచి రెండో తరగతి వరకు ప్రత్యేక తరగతులు

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** భారతీయ విద్యా వ్యవస్థ అకాడమిక్స్ పరంగా ప్రపంచంలో అగ్రగామిగా ఉన్నప్పటికీ, నైపుణ్య (స్కిల్) ఆధారిత విద్యలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి పేర్కొన్నారు విజయ దశమి సందర్భంగా ఆయన ఆస్ట్రేలియా పర్యటన విశేషాలను మీడియాకు వెల్లడించారు. అక్టోబర్ 17 నుంచి 22 వరకు పశ్చిమ ఆస్ట్రేలియాలో పర్యటించి, పలు యూనివర్సిటీలు, పాఠశాలలను సందర్శించినట్లు తెలిపారు,

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 12 మంది ఎడ్యుకేషన్ లీడర్లతో కలిసి అక్కడి విద్యా విధానం, కరిక్యులం, ఉపాధి అవకాశాలను పరిశీలించినట్లు చెప్పారు.

**ఒకేషనల్, టెక్నికల్ విద్యపై దృష్టి అవసరం**

మన దేశంలో విద్య కేవలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, డాక్టర్లను తయారు చేసే దిశగానే సాగుతోందని నరేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. దీనివల్ల అందరూ ఆ స్థాయికి చేరలేక నిరుద్యోగ సమస్య పెరుగుతోందని, టెక్నికల్, ఒకేషనల్, స్కిల్ బేస్డ్ కోర్సుల్లో వెనుకబడిపోతున్నామని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక పనులకు సైతం ఇతరులపై ఆధారపడే పరిస్థితి నెలకొందన్నారు. ఆస్ట్రేలియాలో మాత్రం బైపీసీ, ఎంపీసీలతో పాటు సీఈసీ, ఎంఈసీ, వెటర్నరీ, ఆర్ట్స్, మ్యూజిక్, స్పోర్ట్స్ తదితర అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని, అక్కడ విద్యార్థుల్లో ఎలాంటి ఒత్తిడి కనిపించదని పేర్కొన్నారు.పాఠశాల స్థాయిలో ఒకే విద్యా విధానం అక్కడ నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యా విధానం అమల్లో ఉందని, మధ్యలో బోర్డు పరీక్షల ఒత్తిడి లేకుండా ఇంటర్నల్ ఎగ్జామ్స్‌కు 50 శాతం మార్కులు కేటాయిస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూనియర్ కళాశాలను పాఠశాల స్థాయిలో విలీనం చేసే అంశంపై స్పష్టతనిచ్చిన నేపథ్యంలో, ఈ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అలాగే 8వ తరగతి నుంచే విద్యార్థులకు నచ్చిన సబ్జెక్టులు (బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, అగ్రికల్చర్ సైన్స్, స్పోర్ట్స్) ఎంచుకునే స్వేచ్ఛ ఉందని వివరించారు. మైనర్ పిల్లల ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని అక్కడ చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారని చెప్పారు.

**అల్ఫోర్స్‌లో ఇంటర్నేషనల్ కరిక్యులం**

తల్లిదండ్రుల ఆసక్తికి అనుగుణంగా అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో త్వరలో వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు నరేందర్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి ప్రభుత్వ ఆమోద ప్రక్రియ తుది దశకు చేరిందని, రాబోయే విద్యా సంవత్సరంలో నర్సరీ నుంచి రెండో తరగతి వరకు ఈ కరిక్యులంతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

**తల్లిదండ్రులకు విజ్ఞప్తి**

మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి తేవద్దని, ఐఐటీ, మెడిసిన్‌తో పాటు క్లాట్, సీఏ, అగ్రికల్చర్, స్పోర్ట్స్ తదితర రంగాల వైపు కూడా పిల్లలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో ఇన్ఫ్రాస్ట్రక్చర్, డిజిటల్ బోర్డులు, లేబరేటరీలను మరింత ఆధునీకరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను పత్తి చేలలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తాం

### పత్తి చేల బాట పట్టిన 86 మంది విద్యార్థులకు విముక్తి

### మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి.

### తెలకపల్లి ఎస్సై రమేష్



**నాగర్ కర్నూల్ , అక్షిత ప్రతినిధి:** తెలకపల్లి మండల కేంద్రంలోని లింగాల – తెలకపల్లి రహదారిలో గల పశువుల సంత సమీపంలో పత్తి చేలకు తరలి వెళ్తున్న బాల కార్మికులకు విముక్తి కల్పించారు. వివరాలలోకి వెళితే ఇటీవల దసరా సెలవులు ఉండడంతో పాఠశాలకు వెళ్లే పిల్లలతో పత్తి చేల బాట పట్టారు. పాఠశాలలు పునర్ ప్రారంభం కావడంతో పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా పత్తి చేలకు వెళ్తున్నారు. ఇట్టి విషయం కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇట్టి విషయాన్ని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ దృష్టికి తీసుకు వెళ్లడంతో శనివారం జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, మరియు విద్యాశాఖ, చైల్డ్ హెల్ప్ లైన్1098, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పత్తి చేలకు తరలి వెళ్తున్న 86 బాల కార్మికులకు నిలుపుదల చేసి వారిని తిరిగి పాఠశాలలకు పంపించడం జరిగింది. కొల్లాపూర్ , మల్ల చింతలపల్లి , నార్లాపూర్, సాతాపూర్ , పెద్ద కార్పవుల , మరికల్, రాయిపాకుల, ఆలేరు, బొప్పల్లి, గౌ రెడ్డి పల్లి, పెద్దకొత్తపల్లి, తదితర గ్రామాల నుండి నిత్యం పత్తి చేలకు వివిధ వాహనాలలో తరలి వెళ్తున్నారు. వారికి విముక్తి కల్పించి పిల్లలకు మరియు తల్లిదండ్రులకు, వాహన డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలను పత్తి చేలకు తీసుకువెళ్తే డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పాఠశాలలో చదివే పిల్లల్లో పత్తి చేలకు వెళ్ళరాదరి రాబోయే పదవ తరగతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలంటే ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి హాజరుకావాలని సూచించారు. తెలకపల్లి ఎస్సై రమేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలను పనులకు తరలించరాదని , కెపాసిటీ అధికంగా ప్రజల తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని , హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ నుండి మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, డిసిపియు యూనిట్ డిసిపిఓ శ్రీశైలం, గౌ రెడ్డి పల్లి జెడ్పి ఉన్నత పాఠశాల హెచ్ఎం శివ ప్రసాద్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 యశ్వంత్, తెలకపల్లి ఎస్సై రమేష్, ఏఎస్ఐ శంకర్ రెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీను నాగరాజు, మరియు కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్లు జాకీర్ హుస్సేన్ శ్రీనివాసులు, సోషల్ వర్కర్ శివుడు, సి ఆర్ పి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు దరఖాస్తుల అందజేత



**చిలుకూరు, అక్టోబర్ 24,(అక్షిత న్యూస్):** చిలుకూరు గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన సుమారు 150 దరఖాస్తు పత్రాలను బీఆర్ఎస్ పార్టీ చిలుకూరు మండల అధ్యక్షుడు అక్కెనపల్లి జానకిరామాచారికి స్థానిక నాయకులు అందజేశారు.ఈ సందర్భంగా చిలుకూరు గ్రామ ఉపసర్పంచ్ బెల్లంకొండ నాగయ్య, పీఏసీఎస్ చైర్మన్ జనార్ధన్, ఎమ్మెల్సీ కోఆర్డినేటర్ మాదారపు శ్రీను, ఎస్.కే. పాషా, తాలూరి శ్రీనివాస్, అల్లి ఉపేందర్ తదితరులు పాల్గొని పట్టభద్రుల ఓటరు నమోదు దరఖాస్తు పత్రాలను అందజేశారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఈ దరఖాస్తులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిలుకూరులో మండల సర్వసభ్య సమావేశం

### ఎల్‌నినో ప్రభావం, జలసిరి పనులపై చర్చ



**చిలుకూరు,అక్టోబర్ 24, (అక్షిత న్యూస్):** చిలుకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి జె.సత్యనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం తగ్గడం, నీటి లభ్యతపై పడే ప్రభావాన్ని ఎదుర్కొనే ముందస్తు చర్యలపై చర్చించారు.విబ్ జిరామ్‌జీ జలసిరి పనుల పురోగతిని సమీక్షించి, నీటి వనరులు, సాగునీటి సదుపాయాలు, వర్షపు నీటి సంరక్షణ, చెరువులు, కాలువల అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. తాగునీటి వనరుల పరిరక్షణ, నీటి వృథా నివారణ, అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి సరఫరా, ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, వ్యవసాయం, పాఠశాలలు, గ్రామీణాభివృద్ధి సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులకు అందేలా చర్యలు, పెండింగ్ పనుల త్వరితగతిన పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు, తహసీల్దార్ ధ్రువకుమార్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు,మండలంలోని గ్రామసర్పంచులు,వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి టిఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా గూడ లావణ్య నేత నియామకం..

### నియామకం పత్రం అందజేసిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్..



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రక్షణ సేన శేరిలింగంపల్లి నియోజక వర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా గూడ లావణ్య నేత నియమితులయ్యారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత్రి కవిత ఆశయాలకు అనుగుణంగా, వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ నాయకత్వంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని లావణ్య నేత పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మహిళలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి సాధికారతతో పాటు సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

## 9వ వార్డు కమిటీ అధ్యక్షునిగా నర్ర మహేష్



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పిలుపు మేరకు, చేర్యాల పట్టణంలో నూతన వార్డు కమిటీ ఎన్నిక ప్రక్రియలో భాగంగా, శనివారం పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో 9వ వార్డులో కమిటీని ఎన్నుకోవడం జరిగింది. వార్డు కమిటీ అధ్యక్షునిగా నర్ర మహేష్, ఉపాధ్యక్షులుగా బుడిగె కిషన్, నర్ర రమేష్, ప్రధాన కార్యదర్శులుగా ఉడుగుల లింగం, నర్ర కేశవులు, అల్లం రమేష్, బస్వరాజు క్రిష్ణలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు పూర్మ ఆగంరెడ్డి, ఆడెపు చెంద్రయ్య, దాసరి కళావతి, పచ్చిమడ్ల వెంకటయ్య, ఎండీ ఖాజా, ఉట్లపల్లి శ్రీనివాస్, ఐత శ్రీనివాస్, బందెల మహిపాల్ రెడ్డి, కాటం శ్రీనివాస్, చింతల మల్లేశం, నీలం సన్నీ, తుమ్మలపల్లి సంతోష్, మల్లిగారి నర్సింలు, పచ్చిమడ్ల సత్యనారాయణ, అంబాల రాము, మామిడాల నాగరాజు, చెన్నిగారి బిక్షపతి, కొలిపాక వెంకటేష్, బుట్టి బిక్షపతి, గుడాల శ్రీనివాస్, మల్లిగారి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## టీజీపీఎస్సీ పరీక్ష కేంద్రాల పరిశీలన

### కరీంనగర్ సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగరంలోని వివేకానంద డిగ్రీ కళాశాల, హుజూరాబాద్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలల్లో టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో జరుగుతున్న అసిస్టెంట్ సైంటిస్ట్, అనలిస్ట్ గ్రేడ్–2 ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలను శనివారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రత కల్పించామని, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు.కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 144 అమలు చేస్తూ, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించినట్లు వెల్లడించారు. "సీసీ కెమెరాల నిఘా, బయోమెట్రిక్ విధానం, అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ అధికారులు, కేంద్రాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.

## ఈ నెల 26న జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు

### జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** కుమ్రంభీమ్ 86వ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన రెసిడెన్షియల్ పాఠశాలలు మినహా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన సెలవుకు బదులుగా నవంబర్ 14వ తేదీ 2వ శనివారం అన్ని పాఠశాలలు పని దినాలు పాటిస్తాయని తెలిపారు.

# చౌటుప్పల్ కాంగ్రెస్‌లో సంస్థాగత బలోపేతంపై దృష్టి

### త్వరలో 20 వార్డుల్లో నూతన కమిటీలు..బూత్ కమిటీల ఏర్పాటు..

### మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్

### మునుగోడు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త పబ్బురాజు గౌడ్



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించినట్లు మునుగోడు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ తెలిపారు.శనివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన చౌటుప్పల్ పట్టణ పరిధిలోని లక్కారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ముఖ్య కార్యకర్తల సమావేశంను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్, మునుగోడు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజ్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని పార్టీ సంస్థా గత నిర్మాణంపై కీలకంగా పలు అంశాలపై చర్చించారు.

ఈ సమావేశంలో ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కార్యాచరణకు సిద్ధమైందని తెలిపారు.

మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు, త్వరలోనే బూత్ కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించిన్నట్లు పేర్కొన్నారు. ప్రతి వార్డులో పార్టీకి బలమైన నాయకత్వాన్ని నిర్మించి, బూత్ స్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయంతో ముందుకు నడిపించడంపై దృష్టి సారించిన్నట్లు తెలిపారు.

రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని అన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బ్లాక్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్ , సింగిల్ విండో వైస్ చైర్మన్ పర్నె శివారెడ్డి, మాజీ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహా గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మార్కెట్ డైరెక్టర్లు, రామాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ప్రధాన కార్యదర్శులు ఇప్ప వెంకటేష్, ఎర్రగుని లింగస్వామి యాదవ్, ఉపాధ్యక్షులు వెంకట్ కుమార్, అంతటి విజయలక్ష్మి బాలరాజు, చెరుకు లింగస్వామి, బండమీది మల్లేష్, ఎండి వహీద్, అధికార ప్రతినిధి శ్యామకూర యాదయ్య, కార్యదర్శులు మాదాని గోపాల్, గుండబోయిన మనిత ఐలయ్య యాదవ్, ఓర్సు శ్రీజా రాజు ,ఎండి ఫరోజ్ దుబ్బాటి దయాకర్ రెడ్డి, బత్తుల రాజు, జక్కర్తి సుధా, సుమతి,కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు లు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాండ్ల వెరిఫికేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

### బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి: పశ్య పద్మ



**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, మంచిర్యాల జిల్లా కేంద్రంలో సీఐడీ ఆధ్వర్యంలో బాండ్ల వెరిఫికేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ ప్రభుత్వాన్ని కోరారు. మంచిర్యాలలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఎనిమిది రాష్ట్రాల్లో సుమారు 32 లక్షల మంది అగ్రిగోల్డ్‌లో రూ.6 వేల కోట్లకు పైగా డిపాజిట్లు చేశారని తెలిపారు. సంస్థ మూతపడిన తర్వాత పలువురు ఖాతాదారులు, ఏజెంట్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారి కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు.ఆంధ్రప్రదేశ్‌లో సీఐడీ ఆధ్వర్యంలో ఏడు బాండ్ల వెరిఫికేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, తెలంగాణలో సుమారు మూడు లక్షల మంది బాధితులకు కేవలం మూడు కేంద్రాలే ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో మాత్రమే కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో సుమారు 80 వేల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నందున మంచిర్యాలలో వెరిఫికేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని, సీఐడీ అధికారులను కోరారు.ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యుడు దేవి పోచన్న పాల్గొన్నారు.

**జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

సమావేశం అనంతరం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రామడుగు లక్ష్మణ్, అధ్యక్షుడిగా డి. ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేకల దాస్, ఉపాధ్యక్షుడిగా తిరుపతి రావు, ప్రధాన కార్యదర్శిగా యం. రామారావు, సహాయ కార్యదర్శిగా జీవన్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కిషన్, ఎల్. విజయ, యం. శశికళ, ఏ. చంద్రకళ, పి. జంగులను ఎన్నుకున్నారు.

## చలో హైదరాబాద్ జయప్రదం చేయండి

### పంచాయతీ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

### యూనియన్ జిల్లా కార్యదర్శి గ్యార పాండు

### రంగారెడ్డి జిల్లా డిపిఓ కి వినతి పత్రం అందజేత



**రంగా రెడ్డి అక్షిత బ్యూరో :** గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గ్యార పాండు డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా డిపివో కి వినతిపత్రం ఇవ్వటం జరిగింది.

ఈ సందర్భంగా గ్యార పాండు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 12790 గ్రామపంచాయతీలో 52,000 మంది గ్రామపంచాయతీ ఉద్యోగులు కార్మికులు పనిచేస్తున్నారని నిత్యం గ్రామాల్లో ప్రజలకు సేవలు చేస్తున్నారు. 2019 సంవత్సరంలో తీసుకువచ్చిన జీవో నెంబర్ 51 మల్టీపర్పస్ విధానం పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాడుగా మారిందన్నారు. ప్రతీ కార్మికుడు అన్ని పనులు చేయాలనే నిబంధనతో అనేకచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికులకు వేతనాలు పెంచి పర్మినెంట్ చేస్తామని ఎన్నికలకు మేనిఫెస్టోలో ప్రకటించింది. కానీ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్న ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా అమలు చేయటం లేదు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి, పిఆర్సి లో కూడా కార్మికులను గుర్తించాలని, కనీస వేతనం 30 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. కారోపర్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని, కార్మికుల అక్రమ తొలగింపు పై చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐటి జిల్లా కమిటీ సభ్యులు పోచమోని కృష్ణ, జగన్ పోల్కంపల్లి తదితరులు పాల్గొన్నారు.